# రాబందులు

రెవెన్యూ స్టాంపుమీద సంతకం చేస్తున్న జానకి చేతివేళ్లు వణికాయి. ఇదే ఆమె ఆఫీసులో తీసుకొనే ఆఖరి జీతం.

పరధ్యానంగా డబ్బందుకొని, యాంత్రికంగా పర్సులో పెట్టుకొని, బరువుగా బయటికి నడుస్తున్న జానకిని ఆఫీసులో కొందరు జాలిగా చూశారు—

మరికొందరు జాలిపడుతున్నట్టు ముఖాలు చూశారు.

జానకి తలవంచుకుని, కాళ్ళీడ్చుకుంటూ పేవ్‌మెంటు మీద నడక సాగించింది.

ఆమెకు భవిష్యత్తు అంధకారమయంగా కన్పిస్తోంది. కళ్ళు పొడుచుకొని చూసినా వెలుగు రేఖ కన్పించడం లేదు.

రోడ్డుమీద కార్లూ, సైకిలు రిక్షాలూ వరసలుగా పోతున్నాయి. రోడ్డుకు ఇరుపక్కలా పేవ్‌మెంటుమీద జనం నడుస్తున్నారు.

జానకికి ఇదేమీ కన్పించడంలేదు. తను హఠాత్తుగా ఏదో నిర్జన ప్రదేశంలోకి విసిరేయబడినట్లు అనిపించసాగింది.

వీధి దీపాలు వెలిగాయి.

జానకి కలలో నడుస్తున్నదానిలా వచ్చి, లకడీకాపూల్ బస్‌స్టాండులో నిలబడింది అలవాటు ప్రకారం.

ఆమె ఆలోచనలన్నీ తన పర్సులోవున్న ఆ రెండు వందల ఏభై రూపాయల చుట్టూనే తిరుగుతున్నాయ్.

ఈ డబ్బుతో ఎన్ని వారాలు బతకాలి! ఇంట్లో అడుగు పెట్టగానే అమ్మ ఎవరెవరికి ఎంత ఇవ్వాలో ఏకరువు పెడుతుంది. అవన్నీ వెంటనే తీర్చవలసిన అప్పులు. లేకపోతే పాలవాడు పాలు పొయ్యడు కిరాణా షాపువాడు సరుకులు ఇవ్వడు.

జానకికి తల్లిమీద విసుగు కలిగింది. అంతలోనే జాలి ముంచుకొచ్చింది.

పాపం! ఆమె మాత్రం ఏం చేస్తుంది. అన్నీ ఇంటి అవసరాలకు తప్పనిసరైన ఖర్చులే!

అసలే జబ్బుమనిషి!

తనకు ఉద్యోగం పోయిందని తెలిస్తే.... ?

దీనికంతా కారణం ఆ సర్వీస్ కమిషన్ కాండిడేటే ! ఇంత కాలంగా ఎక్కడెక్కడో కాలక్షేపం చేసినవాడు, తన ఆఫీసులోనే తన సీట్లోకే వచ్చి వాలాలా ! ఇంతకూ ఆ సావిత్రి అదృష్టవంతురాలు. ఒకరోజు తనకంటే సీనియర్. అపాయింట్ మెంటు ఇద్దరికీ ఒకరోజే వచ్చింది. అమ్మకు ఆ రోజే రోగం ఎక్కువ కావాలా ! అందుకే తను ఆరోజు ఆర్డర్సు అందుకోగానే ఆఫీసుకు వెళ్ళలేక పోయింది.

ఒక్కరోజయినా సీనియర్ సీనియరే ! నిముషాలూ క్షణాలే వ్యక్తుల జీవితాన్ని తారుమారు చేస్తున్న ఈ యుగంలో ఇరవైనాలుగు గంటలు....సీనియర్ ( ఇరవై నాలుగు గంటలే ) పని సరిగా చేయక పోయినా తీసెయ్యడానికి (జూనియర్ వుండగా) రూల్సు ఒప్పుకోవటు.

ప్రపంచంలో సుఖ సంతోషాలన్నీ అదృష్టవంతులకే ముక్తమైనట్లు, ఈ రూల్సు కూడా వారికే ఊడిగం చేస్తాయి. కాకపోతే ఆ సావిత్రికి ఉద్యోగం వుండటం ఏమిటి ! తనకు పోవడం ఏమిటి !

అసలా సావిత్రికి ఉద్యోగం ఎందుకు ? అలనాటి సత్యభామకు ఏడు వారాల నగలుంటే ఈ సావిత్రికి ఏడు

మాసాల నగలైనా వుంటాయి. ఎప్పుడూ నగలు మార్చుతూనే వుంటుంది. ఇక చీరల సంగతి చెప్పనే అక్కరలేదు.

ఏదో కాలక్షేపంకోసం ఉద్యోగం చేస్తున్నాననీ, పెళ్ళి కాగానే మానేస్తాననీ, అడిగిన వాళ్ళకూ, అడగని వాళ్ళకూ కూడా చెప్తూ వుంటుంది.

ఒళ్ళు వంచి పనిచెయ్యదు. పని చెయ్యమని గట్టిగా మందలించే దమ్ములు ఎవరికీ లేవు. ఆఫీసరుగారి స్నేహితుడి కూతురట !

రంగు రంగుల చీరల్లో. చిరునవ్వుల్ని ఒలకపోస్తూ వయ్యారాలు పోయే సావిత్రిని చూడటానికి అందరూ ముచ్చట పడ్తారు.

తన పరిస్థితికి ఆఫీసులో అందరూ మొసలి కన్నీళ్లు కార్చిన వాళ్ళే !

కాలక్షేపంకోసం ఉద్యోగం చేస్తున్న సావిత్రిని అలాగే వుంచి తననే ఊస్టు చెయ్యాలా ? తనే సావిత్రి పరిస్థితిలో వుండి వుంటే ? తనలాంటి అమ్మాయి ఉద్యోగం కోసం రాజీనామా ఇచ్చి వుండేది.

దేవుడు కూడా దురదృష్టవంతుల ప్రార్థనలు వినిపించుకోడు. ఈ ఉద్యోగం నిలబెట్టమని ఎంతమంది దేవుళ్ళకు మొక్కుకుంది ? అసలు ఆ దేవుడు వున్నాడా ?

"న్యాయం ధర్మం" అంటూ వుంటారు ?

ఆ ధర్మదేవత మాటేమిటి ?

తనలాంటివారి కన్నీళ్ళూ, రక్తమాంసాలూ—ఆ దేవతకు ఇష్టమా ? ఇంకా ఆ దేవత అనాగరికంగానే వుందా ?

ఇరవై ఏళ్ళయినా నిండీ నిండని తను ఏం పాపం చేసింది ? గుమాస్తా ఉద్యోగం చేస్తూ ఏదో విధంగా కుటుంబాన్ని బ్రతికిస్తుందే !

నాన్న నాలుగు కాలాలపాటు ఎందుకు బ్రతికి వుండకూడదు. అవినీతి, అన్యాయం, అంటే ఆమడ దూరంగా వుండే నాన్నకు అకస్మాత్తుగా ఆ గుండెజబ్బు ఎందుకు రావాలి ? ఆనాటినుంచీ, రోగిష్టి తల్లీ, పదేళ్ళ తమ్ముడి బాధ్యతలు తన నెత్తిమీద పడినై. టైపిస్టుగా చేస్తూ సంవత్సరం అంతా ఎలాగో కుటుంబాన్ని లాక్కొచ్చింది.

మళ్ళీ ఎంతమంది చుట్టూ తిరిగితే ఎన్నాళ్ళకు ఉద్యోగం దొరుకుతుందో ? అంతవరకూ....

జానకి మనసు అంతూ పొంతూ లేని ఆలోచనలతో గిజగిజలాడిపోతూ వుంది. బస్సులు వస్తున్నాయ్. కాని ఒక్కటీ ఆగటం లేదు.

కొందరు మగవాళ్ళు బస్‌తోపాటు పరిగెత్తి అందు కుంటున్నారు. కొందరు మళ్ళీ వెనక్కి వచ్చి రొప్పుతూ నిల్చుంటున్నారు.

క్రమ క్రమంగా గండు చీమల పుట్ట పగిలినట్టు జనం కూడుతున్నారు.

జానకి ఆ జనాన్ని చూసి బెదిరిపోతూ, పక్కనే నిల్చునివున్న యువతిని టైం అడిగింది.

'ఏడున్నర!'

'తను అక్కడికి వొచ్చి గంటన్నర అయింది. నిలబడే శక్తి లేనట్టు అనిపిస్తూ వుంది.

తనలోని జీవశక్తిని పాదాల ద్వారా భూదేవి లాగేస్తున్నట్టు అనిపిస్తూ వుంది.

ఒక బస్ వచ్చి ఆగింది. అది జానకి ఎక్కవలసిన బస్ కాదు.

తనంతవరకూ సరిగా చూడలేదు. కాని తన బస్ ఒకటి కంటే ఎక్కువ పోయి వుండదు. పేరుకు నూట నలభై నాలుగు నంబరు బస్ నలభై నిముషాలకు ఒకటుని. కాని గంటకు తక్కువ కాలంలో తనకు ఆ బస్ ఏనాడూ దొరకలేదు. హైదరాబాద్‌లో అన్ని బస్‌లు ఒక ఎత్తు. ఈ నూట నలభై నాలుగో నంబరు బస్ ఒక ఎత్తు. అన్ని

వేళలా జనంతో కిటకిటలాడుతూ వుంటుంది. రాణీగంజి నుంచి బజార్ ఘాట్ మీదగా నాంపల్లి వెళుతుంది.

తొక్కిసలాడుతూ జనంతో బస్ వచ్చి ఆగింది. జానకి కొందరు మగవాళ్ళను తోసుకుంటూ వెళ్ళి ఫుట్ బోర్డుమీద కాలు పెట్టడానికి ప్రయత్నించింది.

ఎవరో ఆమెను వెనక్కు నెట్టేసి బస్ ఎక్కారు. బస్ ముందుకు కదిలింది. వెనక్కి పడబోయిన జానకి నిలదొక్కుకుంది.

" ఇంత రద్దీలో మగవాళ్ళను తోసుకుంటూ పోయి ఆడవాళ్ళు బస్ ఎక్కాలని ప్రయత్నించడం ఎందుకో ! " ఈసడింపుగా అన్నారు ఎవరో !

వీపుమీద చెళ్ళున చరిచినట్టయి జానకి వెనక్కు తిరిగి చూసింది.

ఓ పొడుగాటి యువకుడు చేతిలో రెండు మూడు రకాల వారపత్రికలు మడిచి పట్టుకొని నిల్చొని వున్నాడు. మనిషిలో నాగరికత కంటే నాజూకుతనం ఎక్కువగా కన్పిస్తూ వుంది.

దెబ్బ తగిలిన కంటికి చల్లగాలి కూడా కంటికి బాధాకరంగానే వుంటుంది.

జానకి మనస్సు భగ్గుమంది.

"ఇంత పొద్దుపోయి ఒక స్త్రీ తమ కళ్ళ ఎదుటే రెండు గంటలనుంచీ నిల్చోవడం చూసి కూడా, వెనక్కి నెట్టేసి ఎక్కిన మీ మగవాళ్ళకు చెప్పండి బుద్ధి" విసురుగా అన్నది జానకి.

"అందర్నీ కలిపి తిడతారేం ?" అన్నాడు ఆ యువకుడు రోషంగా !

జానకి తన తొందరపాటుకు సిగ్గుపడింది. తను ఫుట్‌బోర్డుమీదనుంచి కిందపడి వుండేదనే అతను హెచ్చరించి వుంటాడు.

సహనం, సభ్యత, సంస్కారం, శీలం – ఇవన్నీ మానవుడి మానసిక స్థితి సరిగా వున్నప్పుడే అతనివెంట వుంటాయేమో !

మనిషి మహానగరాలనబడే కారడవుల్లో నివసిస్తున్నాడా ?

ఇక్కడ కూడా మరో ఆటవిక నాగరికత పెరుగుతూ వుందా ?

'మీ రెక్కడికి వెళ్ళాలి' ! ఉర్దూలో సన్నగా వినిపించి జానకి చివ్వున తలతిప్పి చూసింది.

జానకి ఆ ప్రశ్న వేసిన స్త్రీని చూసింది.

ఆమె ధరించిన ఎర్రటి నైలాన్ చీరా, ఆకుపచ్చ జాకెట్, విద్యుద్దీప కాంతిలో మిలమిలా మెరుస్తున్నాయి.

మనిషి తెల్లగా పొడవుగా వుంది.

అందమైన ముఖం.

జానకి కళ్లు పెద్దవి చేసుకొని చూడసాగింది.

లిప్‌స్టిక్ పెదవులమీద చిరునవ్వు తళుక్కుమంది.

ఆమె వయసు ముప్పై, ముప్పై అయిదు మధ్యగా వుండొచ్చు అనుకుంది జానకి. దేహం ఇప్పుడిప్పుడే తన సన్నని నాజూకుతనాన్ని విడిచి, గుండ్రంగా బొద్దుతేలి పోతున్నట్టు కనిపిస్తుంది.

'ఎంత సింపుల్‌గా ఎంత అందంగా వుంది!' అనుకుంది జానకి.

అందం ఎక్కడ కన్పించినా జానకి కళ్లు ఇట్టే పట్టేస్తాయి.

'మీ రెక్కడదాకా వెళ్ళాలండీ?' మళ్ళీ మృదువుగా అడిగింది.

రూపానికి తగిన సంస్కారం! అనుకుంది జానకి.

'అల్లావుద్దీన్ బంగళాదాకా!' జానకి సమాధానం ఇచ్చింది ఉర్దూలోనే.

ఆ స్త్రీ కళ్లు మెరిశాయి.

' నేను బేగంపేట వెళ్ళాలి. ఫర్వాలేదు. తోడు దొరికారు. ' అన్నది ఆమె.

జానకి జవాబుగా నవ్వింది. ఆమె నవ్వు ఆమెకే పేలవంగా అనిపించింది.

' అసలు ఏనాడూ బస్సులు ఎక్కినదాన్ని కాదు. మావారు డిప్యూటీ కలెక్టర్. ఇవ్వాళే కారు చెడిపోయింది. స్నేహితురాలికి జబ్బుగా వుంటే వెళ్ళాల్సి వచ్చింది. ' అన్నది ఆమె.

జానకి ఎంతో ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూసింది. శరీరంమీద విలువైన చీరా జాకెట్ తప్ప పెద్దగా నగలేమీ లేవు. మెడలో సన్నటి గొలుసు వుంది. చేతులకు ఆకుపచ్చ మట్టిగాజులు వున్నాయి. ' మర్యాదా మన్ననా తప్ప, డాబూ దర్పంలేని మనిషి ' అనుకుంది జానకి.

' మీ పేరు ? ' జానకి అడిగింది.

' జరీనా బేగం ! '

అందానికి తగ్గ పేరు !

' మీవారు ఏ జిల్లాలో పనిచేస్తున్నారూ ? '

" ఆయన పేరు వినే వుంటారు. మహమ్మద్ హుస్సేన్. నిజామాబాద్‌లో పనిచేస్తున్నారు. " అన్నది జరీనా.

" ఈ బస్సుల్ని నమ్ముకొని లాభం లేదండీ! అయినా నేను ఎప్పుడు ఎక్కాను కనుక! " విసుగ్గా మళ్ళీ అన్నది జరీనా!

జానకి మాట్లాడలేదు.

" ఇంత పొద్దుపోయి ఆటోలోగానీ, టాక్సీలోకానీ ఒంటరిగా వెళ్లాలంటే భయంగా వుంది. " మళ్ళీ అన్నది.

' మీరు హైదరాబాద్‌లోనే వుంటున్నారా! ' జానకి అడిగింది.

ఆ ప్రశ్నకు ఆ స్త్రీ సన్నగా నవ్వింది. ముత్యాల గొలుసు తెగి ముత్యాలు మొజాయిక్ గచ్చుమీద దొర్లిన శబ్దం

ఎంత చక్కగా నవ్వుతుందో ?

" ఆయనక్కడా నే నిక్కడా! ఏం చేస్తాంలెండి! ఎదిగొచ్చే పిల్లల బాధ్యతలు తప్పేవి కావుగా? వాళ్ళ చదువులకోసం నేను ఇక్కడే వుంటున్నాను. వీకెండ్సుకు ఆయన వచ్చి పోతుంటారు. " అన్నది జరీనా.

అదీ జీవితం! సుఖ సంతోషాలకే తప్ప చీకూ చింతలకు ఆస్కారంలేని నిండు బ్రతుకులు.

"మా కలెక్టరుగారు ఊళ్ళో లేనప్పుడు నే నిలాగే సింపుల్‌గా వుంటాను. ఎంత గొప్పవాళ్ళింటి ఫంక్షన్‌కు వెళ్లినా ఇలాగే వెళ్తాను. ఇది నా పుట్టింటి పెంపకంలోనే వుంది. మా నాన్నగారు నిజాం ప్రభుత్వంలో చాలా పెద్ద ఆఫీసరుగా పనిచేశారు."

జానకి ఆమె మాటలకు ముగ్ధురాలైంది.

మళ్లీ ఏదో అడగబోయింది. అంతలో ఆవిడే బేగంపేటలో లాల్ బంగళా దగ్గిర ఎడంచేతి వైపుగా వున్న బంగళా మాదే. కొత్తగా కట్టిన బంగళా. ఇట్టే తెలుసుకో వచ్చు. బస్‌స్టాప్‌లో పరిచయమే కదా అని తోసివెయ్యకండి. వీలు చూసుకొని ఒకసారి మా ఇంటికి రండి." ఎంతో ఆప్యాయంగా ఉర్దూలో చెప్పింది.

"వస్తాను లెండి!" మర్యాదకొరకు అన్నట్టు అన్నది జానకి.

"తప్పక రావాలి. మిస్టర్ సులేమాన్‌ఖాన్ ఇల్లని చెబితే ఎవరైనా చెబుతారు."

జానకికి ఒక ఆలోచన వచ్చింది.

డిప్యూటీ కలెక్టర్ భార్యతో పరిచయం. వాళ్ళింటికి రాక పోకలు ఎంత మంచి అవకాశం ! ఆమె భర్తకు చెప్పి తనకు ఓ చిన్న ఉద్యోగం ఇప్పించలేక పోతుందా !

జానకి జరీనాకు మరికొంచెం దగ్గరగా వచ్చి నిలబడింది. తన పరిస్థితి అంతా జంకుతూనే చెప్పింది.

ఆమె ఎంతో శ్రద్ధగా సానుభూతిగా విన్నది.

' మరీ అంత దిగులు పడిపోకండి. మా కలెక్టర్ గారికి చెబితే నెల తిరక్కుండా మీకు ఉద్యోగం ఇప్పిస్తారు. ఆయన నా మాట కాదనరు. హైదరాబాద్‌లో పెద్ద పెద్ద ఆఫీసర్లు ఎంతోమంది మావారికి తెలుసు. ' అన్నది ఎంతో ఆదరంగా.

జానకికి ఆమె మాటలతో, ఎవరో చెయ్యి ఆసరా ఇచ్చి నెత్తిమీద మోయలేని బరువు దింపినట్టూ, కన్ను పొడుచుకున్నా కనిపించని కారుచీకట్లో అనుకోకుండా ఎవరో వచ్చి టార్చిలైటు వేసి మార్గం చూపించినట్టూ అనిపించింది.

అప్పటికప్పుడే ఉద్యోగం దొరికినట్టు ఆనందపడి పోయింది.

" మీ సహాయం మర్చిపోనండీ. ఎల్లుండి ఉదయం మీ ఇంటికి వస్తాను. " అన్నది ఉత్సాహంగా.

'ఎల్లుండా? ఏ వారం? ఆదివారం కదూ? ఆరోజు మావారు కూడా వస్తారు. మిమ్మల్ని పరిచయం చేస్తాను. తప్పక రండి.' అన్నది జరీనా.

బస్ వచ్చింది.

ఖాళీగానే వుంది.

ఇద్దరూ బస్ ఎక్కి పక్క పక్కనే కూర్చున్నారు.

జరీనా ఏదో ఏదో చెబుతూనే వుంది. జానకి చాలా శ్రద్ధగా, వినయంగా వింటున్నట్టు తల ఊపుతూ కూర్చున్నది. ఊహాలు మాత్రం కొత్త ఉద్యోగం చుట్టూనే తిరుగుతున్నాయి.

కండక్టర్ టికెట్ అడిగాడు.

పాస్ వుందని చెప్పింది జానకి.

జరీనా కేసి చెయ్యి చాపాడు.

ఆమె బ్యాగ్ జిప్‌లాగి లోపలకు చెయ్యి దూర్చింది. ఎంతకూ చెయ్యి బయటికి రాకపోవడంతో కండక్టర్ విసుక్కున్నాడు.

వెంటనే పర్సు తెరిచి టికెట్ తీసుకుంది జానకి.

'అయ్యో మీ రెందుకు కొన్నారు? వెధవ బ్యాగ్. ఇంత పెద్ద బ్యాగ్స్‌తో ఇదే బాధ' అన్నది జరీనా జానకి టికెట్ కొన్నందుకు నొచ్చుకుంటూ.

అదంతా నటన అనిపించింది జానకికి. చాలామంది డబ్బున్నవాళ్ళు పిసినిగొట్టులుగా వుండటం ఆమెకు తెలుసు. బహుశా ఈమె కూడా ఆ కోవకు చెందిందేనేమో అనుకుంది.

బస్ అమీర్‌పేట మలుపు తిరిగి శీశ్‌మహాల్ దాటింది. జరీనా కిటికీనుంచి చెయ్యి చూపుతూ 'అదుగో, అ కన్పించేదే మా బంగళా ' అంది.

ఆ చీకట్లో ఆమె ఏ బంగళాకేసి చూపిస్తున్నదో జానకికి అర్థం కాలేదు.

అయినా కిటికీలో తలదూర్చి చూస్తూ "బంగళా చాలా పెద్దదిగా వుంది. అందంగా కూడా వుంది." అనేసింది కన్పించని బంగళా గురించి. కేవలం జరీనాను సంతృప్తి పర్చాలనే తల తిప్పకుండా దీక్షతో చూస్తున్నట్టు కూర్చుంది.

ఆమె పక్కన ఎవరో దబుక్కున కూర్చున్నట్టనిపించి తల తిప్పి చూసింది. పక్కన ఒక లావుపాటి స్త్రీ కూర్చుని వుంది.

జానకి ఆశ్చర్యంగా బస్ డోర్ కేసి చూసింది. ఆమె బస్ ఆగకముందే డోర్ దగ్గరగా నిలబడి వుంది. బస్ ఆగీ ఆగకముందే దిగేసి చీకట్లో కలిసిపోయింది. ఆమె ముందుకే నడిచిందో, వెనక్కే నడిచిందో కూడా కన్పించలేదు.

జానకికి ఆమె ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలిగించింది.

తనతో ఇంతసేపూ ఆప్యాయంగా మాట్లాడి, చెప్పా పెట్టకుండా దిగిపోయిందేం? ఆమె చెప్పినవన్నీ అబద్ధాలేనా? అసలు డిప్యూటీ కలెక్టర్ భార్యేనా! టికెట్ కూడా కొనలేదే? కనీసం మర్యాదకైనా డబ్బులిస్తా ననలేదే?

అన్నీ లేనిపోని అనుమానాలు. తన పాటికి తను నిలబడి వుంటే దగ్గరకు వచ్చి అన్ని అబద్ధాలు చెప్పాల్సిన అవసరం ఆమెకేం వుంది? దానివల్ల ఆమెకు లభించేదేమిటి? కొంతమంది స్టాప్ దగ్గరకు రాగానే దిగేవాళ్ళను తోసుకుంటూ వెళ్ళి ముందు దిగేస్తారు. అలాంటి వాళ్ళంటే తనకు మహా చిరాకు.

జానకి మనసులో రేగిన అనుమానాలను పక్కకు నెట్టేసింది. ఉద్యోగావసరం, అది దొరుకుతుందన్న ఆశా, ఆమె మనసును జోకొట్టినై.

తను ఎల్లుండి తప్పక ఆమె ఇంటికి వెళ్ళాలి. ఎలాగయినా ఆమె రికమండేషన్‌తో ఉద్యోగం సంపాదించాలి.

మరో పది నిముషాలకల్లా జానకి దిగవలసిన స్టాప్ వచ్చింది.

ఆమె హడావుడిగా పుస్తకాలు సర్దుకొని లేవబోతూ పర్స్ కన్పించక సీట్లో కూలబడిపోయింది. షాక్ కొట్టినట్టు అయిపోయింది. సీటు వెదికింది. సీటు క్రింద వెదికింది. పర్సు కన్పించలేదు.

జానకి నిర్విణ్నురాలైపోయింది. కళ్ళలో గిర్రున నీరు తిరిగింది.

కండక్టర్ కూడా బస్ అంతా తిరిగి చూశాడు. పర్స్ కన్పించలేదు.

ప్రయాణీకులు కూడా తమ తమ సీట్లకింద వెదక సాగారు.

' ఇందాక మీ పక్కన కూర్చున్న ఆమె ఎవరు ?' కండక్టరు ప్రశ్నించాడు.

" నాకు తెలియదు. డిప్యూటీ కలెక్టరు భార్యనని చెప్పింది. " అతి కష్టంమీద సమాధానం ఇచ్చింది జానకి.

బస్సులోని కొందరు ఫక్కున నవ్వారు.

జానకి బిక్కమొహం పెట్టింది.

" అమ్మా మీరు అమాయకుల్లా వున్నారు. ఈమధ్య ఆడ జేబుదొంగలు ఎక్కువైనారు. " అన్నాడు కండక్టరు సానుభూతిగా.

" జేబుదొంగా ? గొప్పింటి మనిషిలా కన్పిస్తుంది ? " అన్నది జానకి నూతిలోనుంచి మాట్లాడుతున్నట్టు.

' అలాగే కన్పిస్తారు. '

' నైలాన్ చీరెల్లో కూడా తిరుగుతున్నారే. '

'వాళ్ళకేం? నెలంతా కష్టపడినవాళ్ళ జీతం ఇలాంటి వాళ్ళు ఒక్క క్షణంలో సంపాదిస్తారు.'

'పాపం! చిన్నపిల్లను ఎంత మోసం చేసింది?'

తలోక మాటా అంటున్నారు.

జానకికి ఎవరి మాటలూ సరిగా విన్పించడంలేదు.

ఒక్కసారిగా శరీరంలోకి దెయ్యం బలం వచ్చినట్టు లేచి విసురుగా బస్సు దిగింది.

కాని ఇంటికేసి నడుస్తుంటే కాళ్ళల్లో సత్తువ లేనట్టు అన్పించసాగింది.

అడుగుతీసి అడుగు వేస్తుంటే, తానేదో ఇసుక పాతర్లోకి దిగబడిపోతున్నట్టు భయం వేసింది.

జానకి ఎలాగో ఇంటిముందుకు చేరుకుంది. వరండాలో తల్లి గోడకు చేరబడి ఊపిరి అందక ఆయాసపడుతూ వుంది.

"ఇంత పొద్దుపోయిందేం! ఎక్కడి కెళ్ళావు?" వస్తున్న ఆయాసాన్ని ఆపుకుంటూ అడిగింది. మరుక్షణంలో ఉక్కిరి బిక్కిరైంది.

ఎన్నడూ లేంది, జానకికి ఆ క్షణంలో తల్లి ప్రశ్న ఏదో తిట్టుగా, నేరారోపణలా విన్పించింది.

"ఆఁ వెళ్ళాను యమలోకానికి. అక్కడా చోటు దొరక్క తిరిగొచ్చాను." విసురుగా జవాబిచ్చింది జానకి.

తల్లి కూతురి ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది.

జానకి చిరచిరలాడుతూ లోపలకు వెళ్ళిపోయింది.

ఏం జరిగి వుంటుంది ? అనుకుంటూ లేవబోయి దగ్గు తెర రావడంతో ఉక్కిరి బిక్కిరైపోయింది తల్లి.

జానకి గుండెలు తరుక్కుపోయే బాధతో మంచానికి అడ్డుపడి వెక్కి వెక్కి ఏడవసాగింది.

' అక్కయ్యా ! ' అంటూ కోడిగుడ్డులాంతరు దగ్గిర చదువుకుంటున్న తమ్ముడు పిల్చాడు.

ఆమె పలకలేదు.

" అక్కయ్యా రేపు ఫీజు కట్టాలి " మళ్ళీ వాడే అన్నాడు గొంతు పెద్దదిచేసి.

గుండెలు అవిసిపోయేలా దగ్గుతున్న తల్లి దగ్గూ, పదేళ్ళ పసివాడి దీన వచనాలూ జానకి వెక్కిళ్ళతో కలిసి— గాఢ నిద్రలోవున్న ధర్మదేవతకు మేలుకొలుపు పాడాయి.

ఆ ఇల్లు ఓ వింత వాతావరణంతో నిండిపోయింది.

రాబందులు అన్ని కాలాల్లోనూ విశృంఖల జీవులు. వాటికి నైతిక విలువలంటూ వున్న సంగతే తెలియదు. వాటికి ఆ నైతిక విలువల అవసరం కూడా లేదు.

అందుకేనేమో హత్యకంటె దొంగతనం పెద్ద నేరంగా నైతిక శాస్త్రంలో నిర్వచించబడింది.

( జయశ్రీ మాసపత్రిక 1969 )